కూతురితో సహా తల్లి ఆత్మహత్య



2



2

పసుపు బోర్డుతో ఏం లాభం: నగేశ్‌రెడ్డి



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## భీమ్‌గల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ గురువారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'దోస్త్' నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో, ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కళాశాలలోని కోర్సుల వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. బీఏ (హెచ్‌ఈపీ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (ఎంపీపీఎస్ అండ్ ఎంపీసీ) బీఎస్సీ (బీజెడ్‌సీ) గ్రూపులలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9848581970 నంబరును సంప్రదించాలని సూచించారు.





## రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

### అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్

**అక్షరటుడే, గాంధారి:** రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ అన్నారు. గాంధారి మండలంలోని హరాలి గార్డెన్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత, ఉచిత కంటి పరీక్షల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతినెలా సుమారు 600 మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. యుద్ధం కంటే రోడ్డు ప్రమాదాలు భయంకరమైనవని.. ఇష్టానుసారంగా తాగి డ్రైవింగ్ చేస్తే ఎదుటివారి ప్రాణాలు పోవడానికి సైతం కూడా కారణమవుతామని వివరించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపవద్దని సూచించారు. అనంతరం ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు రోడ్డు భద్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సుమారు వెయ్యి మందికి కంటి పరీక్షలు నిర్వహించామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, తహశీల్దార్ రేణుక చావన్, ఎంపీడీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.




## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ట్రాఫిక్ నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాలు నివారిద్దామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. నగరంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఆటో, అంబులెన్స్ డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు ప్రతిఒక్కరి ద్వారా రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీవో ఉమామహేశ్వరరావు, నిజామాబాద్ ఇన్‌ఛార్జి ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వినోద్, టౌన్ వన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఎంవీఐ కిరణ్ కుమార్, జీఆర్పీ ఎస్‌హెచ్‌వో లింబాద్రి, ఎస్సై సుమలత, కార్పొరేటర్ బంటు ప్రీతి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

**కామారెడ్డి పోలీసులు ఆదర్శంగా నిలుస్తున్నారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తున్నారు. అర్ధరాత్రి సైతం సకాలంలో స్పందించి ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ముగ్గురిని పోలీసులు రక్షించారు. అర్ధరాత్రుళ్లు కూడా సాహసోపేతంగా ముందుకు సాగుతూ ప్రాణాలు కాపాడుతున్నారు.**

- అక్షరటుడే, కామారెడ్డి

# శభాష్ పోలీసన్నా..



■ మూడు రోజుల్లో ముగ్గురిని కాపాడిన వైనం ■ క్షణికావేశంలో పలువురు ఆత్మహత్యాయత్నం ■ తక్షణమే స్పందించి కాపాడిన పోలీసులు

ప్రజలకు రక్షణ కవచంగా ఉంటామని కామారెడ్డి పోలీసులు నిరూపిస్తున్నారు. పోలీసు విధుల్లో బిజీగా ఉండే సిబ్బంది అర్ధరాత్రి కూడా అప్రమత్తంగా ఉంటూ ఫోన్ వచ్చిన క్షణాల్లో స్పందిస్తున్నారు. వరుసగా మూడు రోజులు అర్ధరాత్రుల్లో ఆత్మహత్యకు యత్నించిన ముగ్గురిని కాపాడి శభాష్ కామారెడ్డి పోలీస్ అనిపించుకున్నారు.

### క్షణికావేశంలో ఆత్మహత్యలు

జిల్లాలో ఇటీవల ఆత్మహత్యలు పెరిగాయి. పోలీసులు ఎక్కడికక్కడ అవగాహన కల్పిస్తున్నా క్షణికావేశంలో తీసుకుంటున్న తొందరపాటు నిర్ణయాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. కూర్చుని మాట్లాడుకుంటే తీరిపోయే సమస్యలను తలకు మించిన భారంగా భావిస్తూ ఆత్మహత్యల బాట పడుతున్నారు. ఫలితంగా విలువైన జీవితాలను కోల్పోతున్నారు.

### ముగ్గురిని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది

జిల్లాలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగాంగా జిల్లా పోలీసులు బిజీగా ఉన్నారు. అయినా అర్ధరాత్రి సమయంలో సైతం అప్రమత్తంగా ఉంటున్నారు. ముఖ్యంగా బ్లూకోల్ట్ సిబ్బంది డయల్ 100కు కాల్ రాగానే క్షణాల్లో ప్రమాదం జరిగిన చోటవాలిపోతున్నారు. జిల్లాలో గడిచిన మూడు రోజుల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని అర్ధరాత్రి 100 కాల్స్ రాగానే తక్షణమే స్పందించారు. వివిధ ప్రాంతాల్లో ముగ్గురిని కాపాడి బాధిత కుటుంబాల మన్ననలు పొందారు.

### అర్ధరాత్రి కాల్స్

బాన్సువాడ పట్టణానికి చెందిన రంగరి వెంకటి అనే వ్యక్తి ఏప్రిల్ 13న డయల్ 100కు ఫోన్ చేశాడు.

- తనకు ఆస్తి పంపకంలో అన్యాయం జరిగిందని ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పాడు. అప్రమత్తమైన బ్లూకోల్ట్ సిబ్బంది కానిస్టేబుల్ నవీన్, హోంగార్డు రాములు ఘటనాస్థలికి చేరుకుని కొన ఊపిరితో వెంకటిని కాపాడి ఆస్పత్రికి తరలించారు.
- సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మేరు కృష్ణమూర్తి ఏప్రిల్ 14న ఇంట్లో నుంచి ఆత్మహత్య చేసుకుంటానని బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి 1 గంటలకు కుటుంబ సభ్యులు డయల్ 100కు సమాచారం అందించారు. బ్లూకోల్ట్ సిబ్బంది కానిస్టేబుల్ వినయ్ రెడ్డి, హోంగార్డు మురళి తక్షణమే స్పందించి టేక్రియాల్ చెరువు వద్ద కృష్ణమూర్తిని గుర్తించి మాటల్లో పెట్టి ఆత్మహత్యకు పాల్పడకుండా కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.
- రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన బచ్చన్నగారి నర్సింలు ఏప్రిల్ 15న మద్యం మత్తులో భార్యతో గొడవపడి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి టవల్‌తో ఉరి వేసుకునే యత్నం చేశాడు. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు రాజిరెడ్డి గ్రామానికి చేరుకుని ట్యాంక్‌పైకి ఎక్కి నర్సింలును కాపాడారు.
- నిజామాబాద్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడు తల్లి మందలించిందని ఏప్రిల్ 8న సైకిల్‌పై మధ్యాహ్నం ఇంటినుంచి బయలుదేరి అర్ధరాత్రి కామారెడ్డికి వచ్చాడు. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా విధుల్లో ఉన్న దేవునిపల్లి పోలీసులు బాలుడితో నమ్మకంగా మాట్లాడి తెల్లవారుజామున తల్లిదండ్రులను అప్పగించారు.

### ప్రజల హర్షం

తప్పు చేసిన వారిని శిక్షించడంతో పాటు ప్రజలకు రక్షణగా ఉంటామని కామారెడ్డి పోలీసులు నిరూపిస్తున్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో విధులు నిర్వర్తిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బంది ప్రజల మన్ననలు పొందుతున్నారు. అర్ధరాత్రి ఆపద ఉందని ఫోన్ చేస్తే తక్షణమే స్పందించి ప్రాణాలు కాపాడుతున్నారు. దాంతో పోలీసుల నిబద్ధతలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### డయల్ 100కు ప్రత్యేక ప్రాధాన్యత



డయల్ 100కు ప్రత్యేక ప్రాధాన్య తనిస్తున్నాం. ఆపదలో ఉన్న వారు ఎవరైనా 100కు కాల్ చేస్తే తక్షణమే స్పందిస్తున్నాం. దీనిపై ప్రత్యేకంగా బ్లూకోల్ట్ సిబ్బందిని నియమించాం. ఆపద సమయంలో ఏ విధంగా స్పందించాలనే దానిపై వర్టికల్ రూపంలో శిక్షణ ఇచ్చాం. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ నిరంతరం పని చేస్తుంది. ఏ సమయంలో అయినా ఆపద ఉంటే డయల్ 100కు కాల్ చేసి పోలీసుల సహాయాన్ని కోరవచ్చు.

– రాజేష్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి



## అర్హులకు పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సదాశివనగర్ మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూడడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామస్థాయిలో సమస్యలను అధికారులు గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను సభల్లో నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ సర్పంచ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో గిరి, డీఆర్‌డీవో సురేందర్, ప్రత్యేక అధికారి సతీష్, డీఎంహెచ్‌వో రవీందర్, తహశీల్దార్ సత్యం, సర్పంచ్ శిరీష, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సిరికొండలోని ఏజీ దాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల సభలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ముున్ముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ.. రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని వివరించారు. పసుపు రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, వారికి మేలు చేకూర్చడమే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించాలనే ఉద్దేశ్యంతో స్థానిక మార్కెట్ యార్డులో పసుపు అమ్మకాలలో బహిరంగ వేలం విధానాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. పసుపు పంట క్వింటాలుకు సగటున రూ.16,000 ధర లభిస్తోందని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కాకూడదని, వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూస్తామని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మండలంలో నెలకొని ఉన్న పలు సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారం



విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సభలో మండల ప్రత్యేక అధికారి నాగూరావు, ఎంపీడీవో మనోహర్, తహశీల్దార్ రవీందర్ రావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## మీసేవా కేంద్రాలపై ఏసీబీ దాడులు.. పలు కీలకపత్రాలు స్వాధీనం..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాష్ట్రవ్యాప్తంగా పలు మీసేవా కేంద్రాలపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో పలు పత్రాలను వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారు గురువారం వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌తో సహా వివిధ జిల్లాల్లోని సుమారు 11 మీసేవా సెంటర్లపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సెంటర్లలో అధిక వసూళ్లకు పాల్పడడం, కొన్ని సెంటర్లలో బ్రోకర్లు తిష్టవేసి సర్టిఫికెట్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా వారు గుర్తించారు. ఈ క్రమంలో నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న మీసేవా కేంద్రాన్ని సైతం తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో మీ సేవా కేంద్రాల్లో సిబ్బంది, మధ్యవర్తులు, ఏజెంట్లు, అధికారుల మధ్య అనేక అనధికారిక ఆర్థిక లావాదేవీలు, వాట్సాప్ చాట్‌లు జరిగినట్లు అధికారులు గుర్తించారు. పలు మీ సేవా కేంద్రాలు దరఖాస్తుదారుల నుండి అధిక మొత్తాలను వసూలు చేస్తున్నట్లు వారి విచారణలో వెల్లడైంది.



## అర్వింద్ తెచ్చిన పసుపు బోర్డుతో ఏం లాభం..? : నగేష్ రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌కు పసుపు బోర్డు తెచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నారని.. మరి పసుపు రైతులు మద్దతు ధర కోసం రోడ్డుపై ధర్నాలు ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ.. 2004 నుంచి 2014 వరకు తాను మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగిన సమయంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా సమయస్ఫూర్తితో పరిష్కరించడం జరిగిందన్నారు. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చి దేశంలో ఎక్కడైనా కొనుక్కునే అవకాశం కల్పించామన్నారు. ఆన్‌లైన్ వస్తే రైతులకు మద్దతు ధర వస్తుందా లేదంటే నష్టపోతారా అనే భయం ఉన్నప్పటికీ మొదటగా నిజామాబాద్‌లో ఆన్‌లైన్ పద్ధతి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో డీసీసీ కోశాధికారి భక్తవత్సలం, డీసీసీ ఉపాధ్యక్షుడు కౌడపు శరత్ కుమార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, కార్పొరేటర్లు ప్రవీణ్ గౌడ్, పంచారెడ్డి చరణ్, ఎర్రం గంగాధర్, అమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన జిల్లా నాయకులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో జిల్లా నేతలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. వేం నరేందర్ రెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి , మహమ్మద్ షబ్బీర్, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఆర్మూర్ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, బాసా వేణుగోపాల్ యాదవ్ ఉన్నారు.



# డిగ్రీ ప్రవేశాలకు 'దోస్త్' సిద్ధం

**ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల సందడి మొదలైంది. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) ద్వారా ప్రవేశాల ప్రక్రియ నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశం. ఈ మేరకు ప్రవేశాల షెడ్యూల్‌ను, దరఖాస్తు విధానాన్ని ఉన్నత విద్యామండలి విడుదల చేసింది.**

**– అక్షరటుడే, భీమ్‌గల్**

■ మొదలైన ఆన్‌లైన్ ప్రక్రియ ■ రిజిస్ట్రేషన్లు.. మూడు విడతల్లో ప్రక్రియ ■ విద్యార్థులకు సూచనలు జారీ చేసిన ఉన్నత విద్యామండలి

విద్యార్థులు దోస్త్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా 'దోస్త్ యాప్' డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్నెట్‌పై అవగాహన లేని వారు సమీపంలోని మీసేవా కేంద్రాలు లేదా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ఈ ప్రక్రియలో అత్యంత కీలకం.

### మూడు విడతల షెడ్యూల్..

మొదటి విడతలో ఏప్రిల్ 15 నుంచి మే 7 వరకు రిజిస్ట్రేషన్లు (ఫీజు రూ.200). ఏప్రిల్ 30 నుంచి మే 8 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 14న సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో విడతలో మే 15 నుంచి మే 30 వరకు రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్లు ఉంటాయి (ఫీజు రూ.400). మూడో విడతలో భాగంగా మే 31 నుంచి జూన్ 20 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు.

### విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సిన పత్రాలు

ప్రవేశాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యార్థులు తమతమ ధ్రువపత్రాలను ముందే సిద్ధం చేసుకోవాలి. ఇంటర్ మార్కుల మెమో, హాల్ టికెట్, ఆధార్ కార్డు (మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలి). ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (అవసరమైన వారికి). క్రీడలు, ఎన్‌సీసీ లేదా ఇతర కోటా ధ్రువీకరణ పత్రాలు ఉంటే జతచేయాలి.

### జాగ్రత్తలు వహించండి..

వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే సమయంలో తమకు ఆసక్తి ఉన్న కోర్సులు, కళాశాలల ప్రాధాన్యత క్రమాన్ని జాగ్రత్తగా ఎంచుకోవాలి. సీటు కేటాయించిన తర్వాత ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడం మర్చిపోవద్దు. అనంతరం నిర్ణీత గడువులోగా కళాశాలకు వెళ్లి అసలు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. సందేహాల నివృత్తికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించవచ్చు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని నిజామాబాద్ జిల్లాలో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ వేగం పుంజుకుంది. 'దోస్త్' నోటిఫికేషన్ విడుదల కావడంతో విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

### సీట్ల వివరాలు, కోర్సులు..

రాష్ట్రవ్యాప్త గణాంకాల ప్రకారం, ప్రభుత్వ కళాశాలల్లో సీట్ల భర్తీ శాతం (సుమారు 62శాతం) ప్రైవేట్ కళాశాలల (సుమారు 38శాతం) కంటే ఎక్కువగా ఉంది. ఈ ఏడాది కూడా బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (డేటా సైన్స్/కంప్యూటర్స్) కోర్సులకు అత్యధిక డిమాండ్ ఉంది. ఆర్ట్స్ విభాగంలో బీఏ (కంప్యూటర్ అప్లికేషన్స్) వైపు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

### జిల్లాలోని విద్యా సంస్థల గణాంకాలు

నిజామాబాద్ జిల్లాలో జిల్లాలో సుమారు 86 డిగ్రీ కళాశాలలు ఉన్నాయ. అవన్నీ తెలంగాణ యూనివర్సిటీ అనుబంధంతో నడుస్తున్నాయి. అలాగే జిల్లాలో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (అటానమస్)తో కలిపి సుమారు 15కు పైగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. భీమ్‌గల్, మోర్తాడ్, ఆర్మూర్, బోధన్ వంటి ముఖ్య కేంద్రాల్లో ఇవి ఉన్నాయి. సుమారు 70 వరకు ప్రైవేట్ ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి.

## డ్రెయినేజీ పనులు ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గగ్గుపల్లిలో డ్రెయినేజీ పనులను సర్పంచ్ కొండి నడ్పి గంగాధర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండి నడ్పి గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గగ్గుపల్లిలో దశలవారీగా రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థతో పాటు ప్రజావసరాల ప్రాజెక్టులను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాత గంగామణి, వార్డ్ మెంబర్ ఆకాష్ శెట్టి, మార్కంటి మల్లేష్, సెక్రటరీ కిషోర్, రాణి, ఆకాష్, శంకర్, మార్కంటి మల్లేష్, రాజు, నారాయణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతి ఏడాది క్రమం తప్పకుండా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతి రెడ్డి అన్నారు. ఈ మేరకు నగరంలోని వర్ని చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 27వ డివిజన్ కార్పొరేటర్ కల్పె అర్చన చిరంజీవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్రవంతి రెడ్డి మాట్లాడుతూ.. మండుటెండల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్, భక్త హిందూ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆర్థికసాయం



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని చిన్న రాంపూర్‌లో నివసిస్తున్న ముగ్గురు వృద్ధులకు లయన్స్ క్లబ్ సాయం చేసింది. ఆసరా పెన్షన్ లేక, ఎవరి అండదండలు లేక దీనస్థితిలో జీవనం సాగిస్తున్న వారికి బాన్సువాడ లయన్స్ క్లబ్ సభ్యులు మాన వతా దృక్పథంతో ముందుకొచ్చి వారికి సాయం అందించారు. గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి వృద్ధుడికి సుమారు రూ. 2వేల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెజుగం వెంకటరమణ మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయడం అనేది దేవునికి పూజ చేసినట్లేనని పేర్కొన్నారు. కార్య క్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఖలీద్, లయన్స్ సభ్యులు దుద్దాల అంజిరెడ్డి, బునేకర్ ప్రకాష్, పాఠశాలల హెచ్‌ఎం కర్నె వీరప్ప, నక్క ప్రవీణ్, ఉపాధ్యాయులు నరసింహారాజు, కిషన్, ఉపసర్పంచ్ అజీజ్, గ్రామ పెద్దలు కుర్మ గణేష్ పాల్గొన్నారు.





# మండుటెండలో.. గొడుగు నీడలో..

**వారంరోజులుగా జిల్లాలో ఎండలు మండుతున్నాయి. విపరీతమైన వడగాలుల కారణంగా ప్రజలు అల్లాడుతున్నారు. తప్పని పరిస్థితుల్లోనే ఇళ్లలో నుంచి బయటకు వస్తున్నారు. కానీ నిత్యం కురగాయల విక్రయాలతో ఉపాధి పొందే గ్రామీణులు తప్పనిస్థితిలో గంజ్‌మార్కెట్‌లో అమ్మకాలు జరుపుతున్నారు. మండు టెండల నుంచి రక్షణగా పెద్దపెద్ద గొడుగుల అమర్చుకుని వాటి నీడలో కష్టమైనా సరే వ్యాపారం చేస్తున్నారు.**

**– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్**

## నిజామాబాద్ జిల్లాలో దారుణం.. కూతురితో సహా తల్లి ఆత్మహత్య..

**అక్షరటుడే, ధర్పల్లి:** నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. కూతురితో సహా తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ధర్పల్లి మండలం గోవింద్ పల్లికి చెందిన కీర్తన తన ఏడాది కూతురితో కలిసి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బడాభీమ్‌గల్‌కు చెందిన లావణ్య తన పెద్ద కూతురు కీర్తనను గోవింద్‌పల్లికి చెందిన ప్రదీప్‌కు ఇచ్చి పెళ్లి చేసింది. ఈ దంపతులకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అయితే కీర్తనకు పుట్టిన రెండోకూతురు సాన్వి(1)కి గ్రహణం మొర్రి ఉంది. అప్పటి నుండి కీర్తన తనలోతాను మదనపడుతూ ఉండేది. పాప అలా పుట్టడానికి తానే కారణమని.. తాను ఆత్మహత్య చేసుకుంటానని అంటుండేది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో లోపలి నుంచి గడియ వేసుకుని పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. దీంతో మంటలు పాపకు కుడా అంటుకున్నాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే డోర్లు పగులగొట్టి ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు కీర్తన తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## శాశ్వత ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండల కేంద్రంలో శాశ్వత ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని 9వ వార్డు కౌన్సిలర్ నీలం రవి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మండల కేంద్రంలో 'అవుట్ పోస్ట్' పేరుతో కొనసాగుతున్న అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న 2004 మోడల్ పాత ఫైర్ ఇంజిన్ కొద్దిపాటి ఎత్తు ప్రదేశాలను కూడా చేరలేకపోతోందన్నారు. ఇరుకైన గల్లీల్లోకి వెళ్లలేని స్థితిలో ఫైరింజన్ ఉందని పేర్కొన్నారు. భీమ్‌గల్‌లో రూ.కోట్లల్లో విలువైన వ్యాపార సముదాయాలు ఉన్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. భీమ్‌గల్‌తో పాటు సిరికొండ, వేల్పూర్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల వరకు సేవలందించాల్సి ఉన్నందున, ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, తద్వారా ఎస్సైస్థాయి అధికారి, శాశ్వత సిబ్బందితో పాటు 2,500 లీటర్ల సామర్థ్యం గల కొత్త వాహనాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

## వేల్పూర్‌లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' మండల స్థాయి సమావేశం



**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్‌లోని రైతు వేదికలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాల కిషన్ సీఎం సందేశాన్ని చదివి వినిపించి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నర్సారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, గృహజ్యోతి, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రతి నిరుపేద కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. తహశీల్దార్ కొత్త రేషన్ కార్డుల గురించి, వ్యవసాయ అధికారి రైతు భరోసా గురించి వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ సొంత ఇంటి కల నెరవేరినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.